వసూళ్ల ప్లానింగ్..!



ఫిర్యాదు రావడంతో శ్లాబ్‌కు కన్నంపెట్టి వదిలేసిన భవనం



కోర్టు కేసు ఉన్నా కొనసాగుతున్న భవన నిర్మాణం


- జోన్-5లో టౌన్ ప్లానింగ్ విభాగంలో లంచావతారులు
- అక్రమ నిర్మాణాలవైపు కన్నెత్తి చూడని అధికారులు
- అనుమతుల్లేకుండా భవన నిర్మాణాలు
- కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతర్
- కార్పొరేషన్ ఆదాయానికి గండి

జోన్-5 టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు.. అనధికార అంతస్తులు అది కూడా వివాదాస్పద భూముల్లో వెలుస్తున్నా అటు వైపు చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణం ఎక్కడ జరిగినా చేయి తడిపితే చాలు.. అనుమతులు వచ్చేస్తాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి పలు ఘటనలు బలం చేకూరుస్తున్నాయి.

విశాఖ విద్య: మద్రిపాలెం(కరాస) సర్వే నంబర్ 124/1లో 83.24 స్క్వేర్ యార్డు విస్తీర్ణం చేపట్టిన భవన నిర్మాణంపై వివాదం ఏర్పడింది. దీంతో ఇచ్చిన ప్లాన్‌ను టౌన్ ప్లానింగ్ అధికారులు రద్దు చేశారు. అయినా జీప్లస్-3 భవన నిర్మాణం జరుగుతుందని నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో గోపాలపట్నం తహసీల్దార్ రమేష్ ఈ నెల 3న జోన్-5 కమిషనర్‌కు లేఖ రాశారు. బిల్డింగ్ ప్లాన్ రద్దు చేసిన నేపథ్యంలో నిర్మాణ పనులు ఆపించి, తదుపరి చర్యలు నిమిత్తం తగిన ఆధారాలతో కంటెంప్ట్ కేసు వేయాలని ఆ లేఖలో ప్రస్తావించారు. జోన్-5 టౌన్ ప్లానింగ్ అధికారులు దీనిపై స్పందించక పోవడంతో కలెక్టర్ ఆదేశాలు సైతం వీరికి లెక్కలేదా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



వివాదం ఉన్న స్థలంలో నిర్మించిన భవనం



ఎన్‌ఏడీ సమీపంలో అనుమతుల్లేకుండా పాత భవనంపై నిర్మిస్తున్న అదనపు అంతస్తులు

కార్పొరేషన్ ఆదాయానికి గండి

అక్రమ నిర్మాణాలతో నగర పాలక సంస్థ భారీగా ఆదాయం కోల్పోతోంది. అనుమతుల మేరకు నిర్మాణాలు చేపడితే కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరడంతో పాటు ఆ భవన నిర్మాణాల వల్ల భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవు. కానీ టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు ఇందుకు విరుద్ధంగా ఉంది. అనుమతులు ఒకటైతే, నిర్మాణాలు మరోలా జరుగుతున్నప్పటికీ చోద్యం చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

సచివాలయ సిబ్బందికి వేధింపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ సిబ్బందిపై వేధింపులు ఎక్కువయ్యాయి. వీటి పరిధిలో పని చేస్తున్న ప్లానింగ్ సెక్రటరీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. బిల్డర్లు, భవన నిర్మాణదారులు నేరుగా జోనల్ కార్యాలయ ప్లానింగ్ అధికారులతో ఒప్పందాలు చేసుకొని పనులు మొదలుపెడుతున్నారు. ఇలాంటి వాటి విషయంలో ఫిర్యాదులు వస్తే సచివాలయ సెక్రటరీలను బలిపశువులను చేస్తున్నారు. జీవీఎంసీ 52వ వార్డులో ప్రస్తుతం ఇదే జరుగుతోంది. వార్డు పరిధిలో నాలుగు సచివాలయాలు ఉండగా ఇక్కడ ఏ ఒక్కరినీ కుదురుగా పనిచేయనీయకుండా మార్చేస్తున్నారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

కూటమి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రజానీకం అంటున్నారు. జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీకి సమీపంలో పాత భవనంపై అనుమతుల్లేకుండా శ్లాబ్ వేయడంతో ఫిర్యాదులు వెళ్లడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు శ్లాబ్‌కు చిన్న చిన్న రంధ్రాలు పెట్టి వెళ్లిపోయారు. మళ్లీ ఇక్కడ యథావిధిగా పనులు జరుగుతున్నాయి. కూటమి నాయకులు రంగంలోకి దిగి టౌన్ ప్లానింగ్ అధికారులను మేనేజ్ చేస్తుండడంతో జోన్-5 పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని పలువురు అంటున్నారు.

స్థల వివాదంతో ప్లాన్ రద్దు చేశాం

జీవీఎంసీ 52వ వార్డు కరాసలో స్థల వివాదం ఉండడంతో తాము ఇచ్చిన ఇంటి ప్లాన్ రద్దు చేశాం. ప్రభుత్వ స్థలమైతే రెవెన్యూ వాళ్లే బాధ్యత తీసుకోవాలి. అక్రమ నిర్మాణాలు జరిగితే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. 52వ వార్డు నుంచి ఒకరిని ప్రమోషన్‌పై జోనల్ కార్యాలయానికి తీసుకున్నాం. కొంతమంది సెలవు పెట్టారు. సెక్రటరీలు లేని చోట ఇన్‌చార్జిలను నియమిస్తున్నాం.

–ప్రవీణ్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి, జోన్-5

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కూటమి నాయకుల అండతో చాలా చోట్ల అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ, వుడా స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలి. అవినీతి అధికారులపై త్వరలోనే ఉన్న స్థాయిలో ఫిర్యాదులు చేస్తాం.

– ఆల్ఫా కృష్ణ, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి

క్లుప్తంగా

27న శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవం



శ్రీకృష్ణుడి విగ్రహం

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలోని శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా ఎర్నికుమార్, కొయ్య జగదీష్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆంజనేయ శర్మ నేతృత్వంలో ఆ రోజు తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. 7గంటల నుంచి స్వామివారికి విశేష పూజలు, మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సంతోష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

గోపాలపట్నం: కాలనీలో సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తామని సంతోష్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఇటీవల ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. పలు అంశాలపై తీర్మానం చేశారు. గౌరవాధ్యక్షుడి ఏపీ కృష్ణారావు, అధ్యక్షుడిగా ముద్దాడ ఆదినారాయణ, ఉపాధ్యక్షుడిగా బి. మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా రామారావు, కోశాధికారిగా ప్రశాంత్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు చెప్పారు. ఏ సమస్య వచ్చినా సమష్టిగా పోరాడుతామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.


తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన యువతి



యువతిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ విద్యాసాగర్

మల్కాపురం: కళాశాలకు వెళ్లిన ఓ యువతి తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో కలవరం చెందిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. యువతి ఫోన్ సిగ్నల్ ఆధారంతో మూడు రోజుల వ్యవధిలో పట్టుకుని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలు.. మల్కాపురం ప్రాంతానికి చెందిన సిరిపిల్లి మాధవి అనే యువతి బీకాం మొదటి సంవత్సరం చదువుతోంది ఈ నెల 12న కళాశాలకు అని ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి గడిచినా ఇంటికి చేరుకోకపోవడంతో కలవరం చెందిన తల్లిదండ్రులు మల్కాపురం పోలీసులను ఆశ్రయించారు. దీంతో వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆ యువతి ఫోన్ నెట్‌వర్క్ ఆధారంగా హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించి అక్కడకు చేరుకుని ఆ యువతిని శనివారం స్టేషన్‌కు తీసుకు వచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో సీఐ విద్యాసాగర్‌ను యువతి తల్లిదండ్రులు అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో అగనంపూడి ఫ్లైఓవర్ వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ కె.టి. ఆర్.లక్ష్మి తెలిపారు. మృతుడి వయసు సుమారు 55 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. తెలుపు గెడ్డం, ఎరుపురంగులోని హాఫ్ హ్యాండ్స్ టీ షర్ట్, తెలుపు, నలుపు నిలువు గడుల నిక్కరు ధరించి ఉన్నట్టు ఆమె తెలిపారు. మృతుడి వద్ద ఎలాటి ఆధారాలు లభ్యం కాలేదని.. వివరాలు తెలిసిన వారు దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ ఔట్‌పోస్ట్ లేదా 73820 58996 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

స్వచ్ఛత.. మన బాధ్యత



ఆర్టీఏ కార్యాలయంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు



రైతుబజారు లోపలలో శుభ్రం చేస్తున్న రైతులు

గోపాలపట్నం: రవాణా శాఖ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛ విశాఖ కార్యక్రమం నిర్వహించారు. విశాఖ పరిసరాలను మరింత పరిశుభ్రంగా, పచ్చగా మార్చేందుకు కృషి చేస్తామని ఆర్టీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలసి చీపుర్లు పట్టారు. కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు.కార్యక్రమంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గోపాలపట్నం రైతుబజారులో..

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించారు. రైతులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, సిబ్బందితో పాటు జీవీఎంసీ 92వ వార్డు పారిశుధ్య కార్మికులు, సచివాలయ కార్యదర్శులు సంయుక్తంగా రైతు బజారు పరిసరాలను శుభ్రం చేశారు. రైతు బజారు ఆవరణను రైతులు శుభ్రం చేయగా.. జీవీఎంసీ పార్కింగ్ ఏరియా తదితర ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. సింగ్ యూజ్ ప్లాస్టిక్ సంచులు వాడరాదని, ప్రతీ దుకాణం వద్ద డబ్బా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం వీరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రైతులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్‌లో ఫాగింగ్



ప్రకాష్‌నగర్‌లో ఫాగింగ్ చేస్తున్న మలేరియా నివారణ విభాగం ఉద్యోగి

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆదేశాల మేరకు శనివారం దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. ప్రకాష్‌నగర్‌లో దోమల బెడద అధికంగా ఉండడంతో స్థానికులు సమస్యను కార్పొరేటర్ లక్ష్మణరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన జీవీఎంసీ అధికారులకు విషయాన్ని వివరించి ఆయా ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలని సూచించారు. దీంతో ప్రకాష్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో మల్కాపురం మలేరియా నివారణ సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

ఎంఈవో దివాకర్



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలపట్నం ఎంఈవో దివాకర్

కంచరపాలెం: ఉపాధ్యాయులు వృత్తిపరమైన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలని గోపాలపట్నం ఎంఈవో దివాకర్ సూచించారు. జీవీఎంసీ రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. శ్రీనివాస్‌రావు నేతృత్వంలో శనివారం నిర్వహించిన క్లస్టర్ సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. మండల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల సబ్జెక్ట్ టీచర్లకు మొదటి సారిగా క్లస్టర్ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి విజయరామరాజు ఆదేశాల మేరకు ప్రతినెల మూడో శనివారం క్లస్టర్ సమావేశాలు స్కూల్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు ఉపాధ్యాయులు విధిగా సమావేశాలకు హాజరుకావాలని ఎంఈవో దివాకర్ సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ లంక చైతన్య, కరాస, తిక్కవానిపాలెం, ధర్మానగర్, కంచరపాలెం, ఆర్పీపేట, కె.కాలనీ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతకు సామాజిక అవగాహన అవసరం



విద్యార్థినిని అభినందిస్తున్న సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల సుపీరియర్ సాంద్రినా

మల్కాపురం: యువత కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితం కాకుండా.. సమాజంలో జరుగుతున్న విషయాలను కూడా అవగాహన చేసుకోవాలని మల్కాపురం సెయింట్ ఆన్స్ సొసైటీ విశాఖపట్నం ప్రొవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ సాంద్రినా అన్నారు. కళాశాల ఆవరణలో శనివారం సీనియర్ విద్యార్థులతో విజయోత్సవ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి,మహిళా సాధికారతకు సెయింట్ ఆన్స్ విద్యార్థినులు ప్రతీక నిలవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు ఆమె బహుమతులు,సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, ప్రిన్సిపాల్ ప్రేమకుమారి,జాతీయ సేవా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి ,వై.అనసూయాదేవి,బి.అంజలిదేవి,నదియా తదితరులు పాల్గొన్నారు.

యువతులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



లోగో ఆవిష్కరిస్తున్న కోరమాండ్ డీజీఎం శ్రీనివాసరావు



ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతున్న యువతి

మల్కాపురం: ఉపాధి కల్పన కోసం తమ సంస్థ నిరుద్యోగ యువతులకు అందిస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ డీజీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు అన్నారు. 58వ వార్డు ప్రాంత నిరుద్యోగ యువతులకు ఆటో,కారు వంటి వాహనాల డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చే కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే సంకల్పంతో తమ సంస్థ సుమారు రూ.4 లక్షల వ్యయంతో వార్డు పరిధిలో పలువురు మహిళలతో పాటు యువతులకు ఉచిత డ్రైవిగ్ శిక్షణ తరగతులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ జారీ.. ఉపాధి మార్గం చూపే విధంగా కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి లోగోను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఫైనాన్స్ హెడ్ జె.మహేష్, మేనేజర్ (సీఎస్ఆర్)ఎస్.వెంకటరమణ, కోరమాండల్ లేడీస్ క్లబ్ మెంబర్స్,సీఎస్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే ప్రజలకు రక్షణ

సీతంపేట : దేశ ప్రజల హక్కులను రక్షించే పాత్రను భారత రాజ్యాంగం పోషిస్తుందని మాజీ ఐపీఎస్ అధికారి కె.రాజశిఖామణి అన్నారు. ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టుల నెట్వర్క్ (ఐడీజేఎన్) ఆధ్వర్యంలో శనివారం రామాటాకీస్ రోడ్‌లోని అంబేద్కర్ భవన్‌లో 'భారత రాజ్యాంగం ఆవశ్యకత, పరిరక్షణ' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికపై దేశ ప్రజలకు గొప్ప రాజ్యాంగాన్ని అందించిన ఘనత బి.ఆర్.అంబేద్కర్‌కు దక్కిందన్నారు. కుల, మత, లింగ, ప్రాంతీయ, సాంస్కృతిక అసమానతలను రాజ్యాంగం రూపుమాపిందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడటానికి మీడియా ప్రధాన పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో ఏయూ లా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కోట పల్లవి, అధ్యాపకురాలు ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, ఐడీజేఎన్ రాష్ట్ర అధ్యక్షుడు తంగేటి నానాజీ, డాక్టర్ రమేష్‌బాబు, ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న యల్లపు రఘురామ్, గొర్లె చందు, తదితరులు

కంచరపాలెం : విశాఖ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ బాక్సర్లు హైదరాబాద్‌లో జరిగిన జీజీకే బాక్సింగ్ ప్రొఫెషనల్ లీగ్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. విజేతలు హరికిషోర్, శివకుమార్, కె.శ్రీనివాస్‌ను శనివారం డీఎల్‌బీ గ్రౌండ్‌లో నిర్వహించిన అభినందన సభలో ఘనంగా సత్కరించారు. విశాఖ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ ప్రమోటర్ యల్లపు రఘురామ్, కార్యదర్శి వాసుపల్లి అమ్మోరు, విశాఖ పోర్ట్ యూనియన్ నాయకుడు గొర్లె చందు విజేతలను సత్కరించి మరిన్ని అవార్డులు సాధించాలని అభినందించారు. కార్యక్రమంలో ఐబీసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.సునీల్, జడ్జి వాడాడ రూలిన్, కోచ్ బాదంపూడి వాసు, అడ్వయిజర్ సతీష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ఐపీఎస్ అధికారిని వేధించడం తగదు



సంఘీభావం ప్రకటిస్తున్న దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

సీతంపేట : గత ప్రభుత్వంలో సీఐడీ చీఫ్‌గా పని చేసిన ఐపీఎస్ అధికారి పి.వి.సునీల్‌కుమార్ పట్ల ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును దళిత సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా ఖండించింది. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ మామిడి శ్రీనివాస్ మాట్లాడుతూ సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి.సునీల్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు పదే పదే మాట్లాడటం సరికాదన్నారు. దళితులు ఏ ప్రభుత్వానికీ వ్యతిరేకం కాదని, సునీల్ కుమార్‌పై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా పనిచేసిన ఆయన అప్పటి విధానాలు, ఆదేశాల ప్రకారం వృత్తి ధర్మంలో భాగంగా కొంత మంది రాజకీయ నాయకులపై తన సబార్డినేట్ అధికారులతో చట్టపరమైన చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వం మారగానే సునీల్‌కుమార్‌ను రాజకీయ వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. విరసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉన్న రఘురామ కృష్ణంరాజు తను చేసిన ప్రమాణానికి భిన్నంగా, పదవిని దుర్వినియోగం చేసి సునీల్ కుమార్‌ను అరెస్టు చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అంబేద్కర్ భవన్ కార్యదర్శి జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ సునీల్‌కుమార్ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరికాదని, పోస్టింగ్ ఇవ్వకుండా అవమానించడం కుల వివక్ష కాదా..? అని ప్రశ్నించారు. సమావేశంలో బీమ్ సేన వార్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, వేమన, ఓంకార్, జల్లి రాజశేఖర్, ముత్యాబత్తుల రమేష్, ఆకుల శ్యామ్, మామిడి రాజు, సోదదాసి సుధాకర్, కోరమాటి చిన్నారావు, రేణుకుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ ప్యాకేజీతో 'గైస్' విద్యార్థులకు ఉద్యోగాలు



గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణతో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

మురళీనగర్ : అల్ట్రా సిమెంట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) విద్యార్థులు ఉత్తమ వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. కాలేజీలో చదువుతున్న ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ విభాగానికి చెందిన ముగ్గురు, ఆయిల్ టెక్నాలజీ విభాగానికి చెందిన ముగ్గురు, కెమికల్ విభాగానికి చెందిన ఒక విద్యార్థికి ఏడాదికి రూ.4లక్షల ప్యాకేజీతో కంపెనీ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అభినందించారు. ఇతర విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు జయప్రకాష్‌రెడ్డి, ప్రశాంతకుమారి, దామోదర్, విజయలక్ష్మి, ఏటీపీవో కుమార్ పాల్గొన్నారు.